

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### వైకుంఠయాత్ర

**మా ఇంట్లో కొన్నాళ్ళు** శాంత అనే అమ్మాయి పనిచేసేది. నా అదృష్టం ఏమిటోకానీ ఏ పనమ్మాయి అయినా పెళ్ళికుదిరి వెళ్ళిపోవడం, ఏ డ్రైవర్‌ని పెట్టుకున్నా, "ఇల్లు కట్టుకున్నా. దూరం అయింది మేడమ్" అని మానెయ్యడమే. సరే శాంత కార్డ్ చేతికిచ్చి కాళ్ళకి దణ్ణం పెట్టింది. "పెళ్ళికి తప్పకుండా రావాలమ్మా" అంది. సరే అని దానికి ఏం కావాలో కొనివ్వమనే డ్యూటీ మా ఆడపడుచుకి అప్పగించా.

పెళ్ళిరోజు రానే వచ్చింది. అక్షింతలు వేసి నా పనిమీద వెళ్దాం అని ముహూర్తం టైంకి వెళ్ళా. మా తెలంగాణా ప్రాంతంలో ముహూర్తం టైం శుభలేఖల్లో వేసినా, ఆ టైంకి ఇంకా పెళ్ళికి తరలి రావడానికి బస్సు ఎక్కుతూ ఉంటారు. ఓ డాక్టర్ పెళ్ళికి వెళ్తే ముహూర్తం టైంకి మిర్యాలగూడాలో బస్సు స్టార్ట్ అయిందని తెలిసింది. అలాంటి అనుభవాలు ఎన్నో.

కానీ చిత్రంగా ఇక్కడ పెళ్ళివారు టైం కొచ్చారు. అదే విశేషం అయితే మీతో ఎందుకు చెప్తానూ? ఓ 'వైకుంఠయాత్ర' అని రాసున్న వాహనం (చనిపోయిన వారిని శ్మశానానికి తీసుకెళ్ళే శవవాహనం) పందిట్లోకొచ్చి ఆగింది.

ఇదేవిటీ? ఖర్మ.. సడెన్‌గా ఈ అవాంతరం? ఎవరు పోయారో అనుకున్నా. కానీ, గెడ్డాలనుండీ బుగ్గలదాకా గంధం పూసుకుని, రంగు రంగుల చీరల్లో ఆడవాళ్ళూ, మొహానికి పువ్వులు కట్టిన తలపాగాతో పెళ్ళికొడుకు దిగాడు.

నోరు తెరిచి చూస్తున్న మాకు అసలు విషయం ఎవరో చెప్పారు. ఈ 'వైకుంఠయాత్ర' బస్సు అతనే నడుపుతాడుట. వెహికిల్ చేతిలో ఉంది కదా  అని తన స్వజనాన్ని పెళ్ళికి అందులో తెచ్చాడు. బావుందా?

మొన్న మా అబ్బాయి ఫ్రెండ్ ఒకడు అంబులెన్స్ వేసుకుని, వీళ్ళందర్నీ ఎక్కడో పార్టీకి తీసుకెళ్ళాడట. ఎక్కడా ట్రాఫిక్‌లో ఆగిపోవడం ఉండదని. వాళ్ళకి ఆస్పత్రి ఉంది లెండి బడాయి. నాకు తెలిసి, బాగా తిట్టాను. ఓసారి మా ఫ్రెండ్ వాళ్ళ ఊళ్ళో నేను ట్రాక్టర్ మీద ఊరంతా తిరగడం గుర్తొచ్చింది. "ఏమే.. మనం కస్తూరిబా గాంధీ కాలేజీలో దీన్ని పార్క్ చెయ్యడానికి స్థలం ఉంటుందా? తీసుకెళ్దాం" అని అడిగా కూడా.

ఫ్రెండ్స్ అంటే గుర్తొచ్చింది. నాకు వయసూ వారా లేదు ఇరవై నుండి ఎనభై దాకా వయసున్న ఫ్రెండ్స్ ఉంటారు.

"ఓ పదిరోజులు యూ.ఎస్ మా ఫ్రెండ్ పెళ్ళికి వెళ్తున్నా" అన్నాడో ఫ్రెండ్

"ఫ్రెండ్ కొడుకు పెళ్ళా?" సరిగ్గా వినలేదేమోనని మళ్ళీ అడిగా.

"కాదు. నా ఫ్రెండ్ పెళ్ళి" అన్నాడీ అరవై ఐదు ఏళ్ళ పెద్దమనిషి.

"ఎప్పుడు పెళ్ళి?" అన్నా ఆశ్చర్యంగానే.

"పెళ్ళికి ముందు ఓ వారం ఫ్రెండ్స్ అంతా ఎంజాయ్ చేసి, పెళ్ళి రోజున బయల్దేరి వచ్చేస్తాం. మళ్ళీ అతనికి ఫ్రీడమ్ ఉండదు కదా!" అన్నాడు.

"అరవై అయినా ఉంటాయి మీ ఫ్రెండ్‌కి. అంటే ఇంతకాలం ఫ్రీడం సరిపోలే?" అన్నాను.

పెద్దగా నవ్వారు. జవాబులు సాధారణంగా చెప్పరు.

ఆ రాత్రి మా అబ్బాయి మాస్టర్స్ చేస్తూ హాలిడేస్‌కి వచ్చాడు కదా, ఫ్రెండ్స్‌తో 'లేలడక్' ట్రిప్ ప్లాన్ చేసుకున్నాం అని చెప్పాడు.

" ఫ్రెండ్స్‌తో వెళ్ళడం బావుంటుందిరా. ఇలాగే ఫలానా మా ఫ్రెండ్ కూడా ఫ్రెండ్ పెళ్ళికి యూ.ఎస్ వెళ్తున్నారట." అన్నాను.

దానికి వాడు పెద్దగా నవ్వి ." మేం అంటే బైక్ రైడింగ్, బోట్‌లో ఏవో ఎంజాయ్ చేస్తాం. ఈ వయసులో వీళ్ళు ఏం చేస్తారో తెలుసా? మందేసుకుంటారు.." అన్నాడు హేళనగా.

"మందు ఇప్పుడు ఫ్యాషన్ అయిపోయిందిగా?" అన్నాను.

"అబ్బా.. ఆ మందుకాదు.. ఈ వయసు వాళ్ళు ఫ్రెండ్స్‌తో వెళితే

'నా పేస్‌మేకర్ సరిగ్గా పనిచెయ్యడంలేదు. నువ్వు ఎక్కడినుండి తెప్పించావ్?'

'నా బి.పి టాబ్లెట్ పవర్ పెరిగింది.. నీదో?'

'షుగర్ లెవెల్స్ ఈ రోజు పడిపోయాయిరా.. వీ విల్ టేక్ రెస్ట్'

'ఈ రోజు నాకు గోధుమ గడ్డీ, రాగిజావా చాలు'

అని ఒకళ్ళ మాత్రలు ఒకళ్ళు చూసుకుంటూ మందులేసుకుంటారు అంతే" అన్నాడు వాడు.

మొన్నేదో పెళ్ళిలో మా కజిన్స్ అందరం కూర్చుని "నువ్వు థైరాయిడ్‌కి ఏం వేసుకుంటున్నావ్? కొలెస్ట్రాల్ ఉందా?" అని మాట్లాడుకోవడం గుర్తొచ్చింది.

చిన్నప్పుడు బాలమిత్రా, చందమామా చదివి ఫ్రెండ్స్‌తో 'రెక్కల గుర్రం' పగడపు దీవులూ, మంత్రపు సంచీ, రాక్షసుడూ అని మాట్లాడుకునేవాళ్ళం.

కాస్త పెద్దయ్యాక అభిమాన హీరోల గురించీ, ఇంకాస్త చదవ నేర్చాకా 'నవలల్లో హీరోల' గురించీ పెళ్ళిళ్ళయాక స్నేహితురాళ్ళతో సరదాగా చీరలూ, నగలూ, మొగుళ్ళ గురించీ.. ఆతరువాత తరువాత..

మా అమ్మ ఫోన్లో ఫ్రెండ్‌తో మాట్లాడుతోంది. "టైలనాల్ వేసుకో. నాకు యూ.ఎస్ నుండి మా అమ్మాయి తెచ్చి పెట్టింది. కడుపులో మంటకి హెవీ వేసుకో. బి.పి చూపించుకోవాలే ఇవాళ. మా మనవడు ఇంట్లో ఉంటే చూస్తాడు. మా అమ్మాయి తెచ్చిందిగా ఇంట్లోనే ఉంది బి.పి ఆపరేటస్" అని మాట్లాడుతోంది.

హతవిధీ! విధిచేయు వింతలన్నీ అంటే ఇవేకదా!

మా పెద్దమ్మ అయితే డాక్టర్ దగ్గరకి వెళితే ఆవిడకి ఏం రోగాలున్నాయో, దానికి ఏం మందులు రాయాలో అవి సైడ్ ఎఫెక్ట్స్ ఇస్తే మళ్ళీ ఏం రాయాలో డాక్టర్‌కి క్షుణ్ణంగా చెపుతుంది. తెలివైన డాక్టర్ అయితే అవసరం లేకపోయినా నోట్లో థర్మామీటర్ పెట్టేసి వచ్చి తన పని చేసుకుంటాడు. ఓ వయసొచ్చాక పాపం వాళ్ళని ఏం అనలేం.

నేను మల్లాదిగారి ఇంటికి వెళ్ళేసరికి ఓ పెద్దావిడ సోఫాలో కూర్చుని ఆయనతో మాట్లాడుతోంది. ఆయన నీరసంగా వెనక్కివాలి పడిపోయి కనిపించారు.

ఆయన శ్రీమతి నన్ను వంటగదిలోకి పిలిచి "మా పక్కింటి మామీ, యు.ఎస్ నుండి ఆరు నెలల తరువాత వచ్చారు. ఆ విషయాలే చెప్తున్నారు" అంది.

"ఎప్పటినుండీ?" అడిగాను.

"ప్రొద్దుట పదిగంటలకి వచ్చారు" అంది పద్మజ. అప్పుడు మూడు అవుతోంది. ఆయన కూర్చున్న భంగిమకి అర్థం తెలిసింది.

"అది నా ఐపాడ్ దాచేస్తుంది... అన్నం నోట్లో పెడితే కానీ తినదు.. కొరుకుతుంది" ఇదంతా విని "కుక్కపిల్లా?" అని అడిగాను.

"కాదు. మనవడిగురించి" అంది పద్మజ.

"వాడు వంట సరిగ్గా చెయ్యడు అన్నీ నల్లగా మాడిసి పూడుస్తాడు. జ్యూసులే తాగుతాడు" అని చెప్తుంటే "కొడుకు గురించా?" అడిగాను.

"కాదు కోడలు" అని కిసుక్కున నవ్వి రహస్యంగా "ఓసారి ఏమైందో తెలుసా?" అని ఓ ఉదంతం చెప్పింది.

మల్లాదిగారి అభిమానులు ఎవరో ఊరునుండి వచ్చి ఆయనతో మాట్లాడుతున్నారట. ఆయన చుట్టూ ఆయన రాసిన పుస్తకాలు పరిచి ఉన్నాయట.

మామీ అకస్మాత్తుగా వచ్చి 'అవన్నీ చూసి "ఇవన్నీ వీడే రాసాడా?" అందట.

"ఆ? అలా అందా?" అన్నా. ఇంక అభిమానుల పరిస్థితి ఏవిటి...!? ఆయన ఆవిడ వయసుకి గౌరవం ఇస్తారు కాబట్టి ఏమీ అనుకోరు అనుకోండీ.

"ఇంకోసారి మీ అమ్మాయి ఎవడితో ఆటోలో రోజూ వెళ్తోంది? ఎత్తుగా ఉన్నాడు, ఎవడు వాడు?" అందిట మామి.

అప్పుడు వాళ్ళ అమ్మాయి ఇంజనీరింగ్ చదువుతోంది.

ఇంటికొచ్చాక "ఎవరో మగపిల్లాడితో వెళ్తున్నావుట ఎవరే?" అని తల్లి అడిగితే, "ఛ! నేను ఎవరితోటీ ఆటోలో వెళ్ళడం లేదు" అందట ఆ అమ్మాయి. కానీ మామి చెప్పిందే అని వీళ్ళు ఆలోచించారుట.

ఓ రోజు మామీ వచ్చేసరికి వీళ్ళ అన్నయ్యగారి అమ్మాయి ఉందిట. వెంటనే మామీ "వీడితోనే మీ ఊహ ఆటోలో వెళ్తోంది" అందిట. వీళ్ళు తల పట్టుకున్నారట.

అలా జెండరూ, పాడూ పాస్టెన్సూ, ప్రెజెంటన్సూ లేకుండా మామీ ఆరునెలల అమెరికా వాసం గురించి కొన్ని గంటలు అనర్గళంగా మాట్లాడ్తుంటే, "ఇంతకీ మావిడికాయలు పెద్దవి అయ్యాయా?" అంది పద్మజ.

"అవును.. పిల్లలంతా అక్కడే రాళ్ళు వేస్తుంది. అందుకే ఈ టైంకి వచ్చి పూడ్చినా.." అని మామీ టక్కున లేచి వెళ్ళిపోయింది.

అప్పుడు ఊపిరి పీల్చుకుని చెప్పారు మల్లాదిగారు, "మామీకీ మామిడి చెట్టుకీ అవినాభావ సంబంధం ఆ కాయలు. పిల్లలు కోసుకుపోతారు అన్న బెంగతో కాపలాకి ఈ ఎండల్లో ఆవిడ ప్రతి వేసవీ ఇండియాలో ఆ చెట్టు కింద గడుపుతుంది" అని.

ఇంక మా డాక్టర్ ఫ్రెండ్స్ ఉన్నారే! నేను ఏ కంప్లైంట్ చెప్పినా సీరియస్‌గా తీసుకోరు. సడన్‌గా నా జీవితంలో లోటు తెలిసి నాకో జ్ఞానదంతం వచ్చింది. అసలు దాన్ని జ్ఞానదంతం అని ఎందుకు అంటారని ఎఫ్.బిలో ఓ శిష్యుడు అడిగాడు నన్ను. "ఏదైనా ఆలశ్యంగా వస్తే అది జ్ఞానమేమో అని మానవుడి ఆశ బాబూ" అని జవాబు ఇచ్చాను.

ఆ జ్ఞానం సరిగ్గా వచ్చిందా? లేదు అడ్డదిడ్డంగా పడుకుని పెరిగిందట. ఎంత సోమరితనమో అని ముచ్చటేసింది. రెండేళ్ళ క్రితం తీరా యు.ఎస్ ప్రయాణం పెట్టుకున్నాక, నెప్పి ప్రారంభం అయి డాక్టర్ని కలిసాను.

"ఇది కొంచెం టైం పట్టే ప్రొసీజర్. బోన్‌కట్ చెయ్యాలి. కుట్లు వెయ్యాలి. హీలింగ్‌కి కొద్దిగా టైం పడ్తుంది" అన్నాడు.

పదిరోజుల్లో ప్రయాణం. "సరే" అన్నాను. మొదట మత్తు ఇంజెక్షన్ నోరు తెరవమని, కసుక్కున గుచ్చాడు. జబ్బ ఊడిపోయింది. అదేవిటీ అనుకుంటున్నారా? నాకు కాదు. డాక్టర్‌కి. అంత గట్టిగా పట్టుకున్నాను.

ఆ తర్వాత నన్ను సినిమా కబుర్లు అడుగుతూ "కొంచెం.. కొంచెం మత్తు.. ఎక్కుతోంది.." అన్నాకా, తన పని మొదలెట్టాడు. అదేవిటో సగం, పై పార్ట్ (క్రౌన్) తీసాక, "బోన్‌లోకి ఓపెన్ చెయ్యనా?" అడిగాడు.

"నా మొహం.. తర్వాత కూడా నా మొహంలాగే ఉండాలి" అన్నాను. మా టీ.వి సీరియల్స్‌లో, మేము ఆర్టిస్ట్ ఎక్కువ రెమ్యునరేషన్ అడిగితే, ప్లాస్టిక్ సర్జరీ చేసారు అని వేరే అమ్మాయిల్ని పెట్టేస్తుంటాం.

అతను నా వైపూ తన చేతిలో రంపంలాంటి ఇన్స్ట్రుమెంట్ వైపూ చాలాసేపు చూసాడు. ఆ కాసేపట్లో "నేను ఎందుకు ఈ ఎం.బి.బి.ఎస్. చదివానా? చదివానుపో డెంటిస్ట్ ఎందుకైనానా? అయితినిపో ఈవిడ ఏల పరిచయం అయిందీ... పరిచయం అయిందిపో. ఈ కాంప్లికేటెడ్ సమస్యతో నాదగ్గరకి ఏల రావలె?" అనుకుని ఉంటాడు.

తల విదిల్చి "నన్ను నెర్వస్ చేసారు. ఇన్నివేల కేసులు చేసాను. ఇలా ఎప్పుడూ అవలేదు" అన్నాడు జబ్బ చూసుకుని.

"అయితే ఒద్దు" అన్నాను.

అతను కట్ చెయ్యలేదు.

కట్ చేస్తే... ఫ్లయిట్‌లో ఉన్నాను.

రమారమీ రెండేళ్ళు సుఖంగా సాగిపోయాయి. తర్వాత ఒకరోజు ... రెండేళ్ళ అనంతరం అప్పుడే అతని జీవితం మలుపు తిరిగింది...డాక్టర్‌ది. నాకు మళ్ళీ పెయిన్.

సరే బాగా ఆలోచించాను. మా సినిమాల్లో, టీ.విలో ఏక్ట్ చేసే ఓ కాస్మొటిక్ సర్జన్ ఒకాయన గురించి అంతా తెగ చెప్తారు. (అందరి బంధువయా టైంలో ఆయన వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్స్ కూడా) అసిస్టెంట్ డైరెక్టర్ దగ్గర్నుంచీ ప్రతివాడూ వెళ్ళి అవసరమున్నా లేకపోయినా ఏదో ఒక పన్ను ఫ్రీగా పీకించుకొచ్చారు.

ఆయనకి డయల్ చేస్తే పాపం ఇన్ ఫ్రంట్ ఆఫ్ క్రోకొడయల్ ఫెస్టివల్ తెలీక "మేడమ్ మీరు ఫోన్ చెయ్యడం నా అదృష్టం" అన్నారు.

"రేపొస్తా.. ఓ ప్రోబ్లం వచ్చింది" అన్నా.

మర్నాడు వెళ్ళా. నన్ను చూసి పొంగిపోతూ ఆహ్వానించారు. ఆయన మేనల్లుడు గిరి కూడా మా ఆర్టిస్టే, పళ్ళ డాక్టరే.

(ఇక్కడనుండి జరిగిన ఉదంతం నేను చెపుతుంటే తెగ నవ్వి -డాక్టర్ మోహన వంశీ (అంకాలజిస్ట్ ఒమేగా) - ఇదంతా కౌముదిలో రాయవా ప్లీజ్? అని పదే పదే కోరడం వల్ల మిమ్మల్ని ఇబ్బంది పెట్టాల్సి వస్తోంది.)

నన్ను తీసుకెళ్ళి చైర్‌లో కూర్చోపెట్టారు. అసిస్టెంట్ నీళ్ళు తీసుకొచ్చాడు. పక్కన ఎవరికో గంట నుండీ డాక్టర్ సుకుమారి పక్క చైర్‌లో ఓ పిప్పి పన్నుని బతిమాలుతున్న ఆవిడ నేను 'కెవ్వున' పెట్టిన కేకకి అమాంతం లాగేసింది.

ఏం జరిగిందో చూసేసరికి ఆ అమ్మాయి చేతిలో 'పన్ను' నా వైపు కృతజ్ఞతగా చూసింది.

నీళ్ళు తెచ్చిన అసిస్టెంట్ "ఎందుకు అరిచారూ?" అన్నాడు.

"నువ్వు గ్లౌజెస్ వేసుకోలేదు" అన్నాను.

"ప్రతిదానికీ వేసుకోం" అన్నాడు.

"వేసుకోకపోతే నేను నోరు తెరవను" అన్నాను.

తర్వాత డాక్టర్ వచ్చి "మీరు కో ఆపరేట్ చేస్తే పదినిమిషాల పని" అన్నారు.

"చెయ్యకపోతే?" అన్నాను. ఆయన ఎగాదిగా చూసారు.

"అసలు ప్రపంచంలో ఎంత పెద్ద సర్జరీ అయినా ఫర్వాలేదు. ఈ పళ్ళ సర్జరీ తప్ప. ఎందుకంటే, మనకి పూర్తిగా మత్తు ఇవ్వరు. కత్తులూ, పట్టకార్లూ, రంపాలూ, భయమకరమైన పనిముట్లు పట్టుకుని మనని నోరు తెరవమని ముందుకొస్తుంటారు.

ఆయన నోట్లో పట్టకారు పెడ్తున్నప్పుడల్లా మూడుసార్లు తోసేసా. కిందపడి స్టూల్ కొట్టుకుని, బొప్పికట్టిన నుదురుతో "మేడం మీరు సహకరించాలి" అన్నారు.

"నాకు భయం" అన్నాను.

"గిరీ! మేడం చేతులు పట్టుకో" అన్నారు.

నేను గిరివైపు చూసా. గిరికి నా సీరియల్స్‌లో, సినిమాల్లో అన్నింట్లో పెళ్ళికొడుకు వేషాలకి సిఫార్సు చేస్తుంటాను. ఇప్పటి నా చూపుకి అర్థం తెలిసి గిరి ముందడుగు వెయ్యలేదు.

దాంతో ఆయన బుజ్జగించి, బతిమాలి, నా సినిమాలని పొగిడి, నా డైలాగ్స్‌ని తెగ చెప్పి, తన చతుర సంభాషణలతో మొత్తానికి "మత్తు ఇచ్చాగా.. అసలేం తెలీదు" అని పట్టకారు నోట్లోకి పంపి, పట్టి లాగుతుంటే, నేను కూడా ఆ పట్టకారుతో బాటే పైకి లేవడం మొదలు పెట్టా.

"అలా చెయ్యకూడదు మేడం" అన్నాడు.

ఇదేమైనా నటనా? ఏక్టింగ్ స్కూల్‌లో చేరి నేర్చుకోడానికి?

ఆపమని చెయ్యి చూపించా.

ఆయన వినలేదు.

మళ్ళీ ఒక్క తోపు తోసా. ఈసారి వెళ్ళి పక్క చైర్‌లో ఉన్న పేషెంట్ మీద పడ్డాడు. ఆవిడ అసలే బురఖాలో ఉంది "మర్‌గయారే" అని కేకలు పెట్టింది. సడెన్‌గా ఇంత మనిషి వెళ్ళి స్కైలాబ్‌లా మీద పడితే మరి ఏవంటుంది?

ఆయన లేచి, మరింత కర్తవ్యోన్ముఖుడై, విజృంభించి మళ్ళీ ముందుకొచ్చాడు.

"కొంచెం ఆగండి. మాట్లాడాలి" అన్నాను.

"ఉహూ! మాట్లాడితే ఏమౌతుందో డాక్టర్ రవీంద్ర నాతో చెప్పాడు" అన్నాడు.

మాఫియాలాగా ఈ డాక్టర్స్‌కి కూడా నెట్‌వర్క్ ఉంటుందన్నమాట.

"రవీంద్ర మీకు తెలుసా?" అనేలోగా ఈయన మళ్ళీ పీకడం స్టార్ట్ చేసాడు. నా నోట్లోంచి వరసగా ఫ్రెంచ్ తిట్లొచ్చాయి. అయినా అవి బయటకి వినిపించలేదనుకోండీ. మనిషికి అన్ని చమట్లు పడ్తాయని, అంతలా అలిసిపోతారనీ అప్పుడే తెలిసింది. నాకు కాదు చమట్లు. డాక్టర్‌కి. మొత్తం తడిసిపోయి, నా వైపు చూస్తుంటే, నోట్లోంచి అది తియ్యమని సైగ చేసి, తీసాక "అయిపోతుంది. ఏం కాదు ఫర్వాలేదు తియ్యండి" అని ధైర్యం చెప్పాను.

నానుండి ఆ మాత్రం ఓదార్పు, ధైర్యం ఆశించని ఆయన వెంటనే రెచ్చిపోయాడు. ఆ తర్వాత పక్కనున్న ఆఫీసుల వాళ్ళు కాసేపు పనులు మానేసి "ఏవిటీ హాహాకారాలు?" అని ఆలోచించి ఉంటారు. ఈ హాహాకారాలు నావి కావు. నా గెడ్డం కదలకుండా పట్టుకున్న అసిస్టెంట్ కుర్రాడి చెయ్యి మెలి తిప్పేసా! వాడివి.... దంతం పీకేసిన ఆనందంలో డాక్టర్ అరిచినవి.

అలా ఆనందాతిశయంతో అరిచి "ఓ సారి ఎక్స్‌రే తీద్దాం. అంతా క్లియర్‌గా ఉంటే క్లోజ్ చేసేస్తా" అన్నాడు.

ఎక్స్‌రే కోసం నాదాకా వచ్చిన గిరి "నన్నోడి తన్నోడెనా... తన్నోడి నన్నోడెనా?" అన్న మీమాంసలో అసలు ఈ డాక్టర్ మావయ్య ఈవిడ మీద నన్ను ప్రయోగించి, నా కెరీర్‌నీ, జీవితాన్నీ శాశ్వత సమాధి చేసేస్తున్నాడా? అని ఆలోచించి "ప్లీజ్ మేడం" అన్నాడు ఆల్‌మోస్ట్ కన్నీటితో.

"ఊ" అన్నాను.

అతను నోట్లో ఓ క్లిప్‌లాంటిది పెట్టి ఎక్స్‌రే తీస్తుంటే, "పక్కవికూడా తియ్యి చూద్దాం" అన్నాను. నా మాట వినిపించుకోలేదు. తీరా ఎక్స్‌రే వచ్చాక చూస్తే, పీకడం పీకారు కానీ అది లోపల ఎన్నిముక్కలైందో చూసుకోలేదు అమాయకపు డాక్టర్. ఇంకో రెండు చిన్నముక్కలు లోపల మెరుస్తూ కనిపిస్తున్నాయి. "ఎందుకంటే నా పేస్ట్‌లో ఉప్పుతో పాటు నిమ్మరసం, ఆవపిండి కూడా ఉంది"

డాక్టర్ మొహంలో అంత అంతులేని నైరాశ్యం ఎప్పుడూ వచ్చి ఉండదు.

ఈలోగా నేను పక్కనున్న మేగ్‌జైన్‌లో శ్రీదేవి కూతురు అమితాబ్‌బచ్చన్ మనవడితో డేటింగ్ చేస్తోందా? అన్న వార్త చదువుతున్నాను.

"సారీ మేడం.." అన్నాడు బిక్కమొహంతో డాక్టర్.

"ఏం? ఎక్కువరోజులు బ్రతకనా?" అడిగాను.

"కాదు ఇంకో రెండు చిన్న ముక్కలు మిగిలిపోయాయి" అన్నాడు.

కౌశికుడు కొంగని చూసినట్లు చూసా. అదేవిటి త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాల్లోలా అన్నీ రాంగ్ పౌరాణిక రిఫరెన్సులు.

మళ్ళీ డాక్టర్‌గారు "నోరు తెరవండి. కళ్ళు మూసుకోండి"

"ఆంజనేయ దండకం చదువుకోండి" ఇది నేను చెప్పాను.

మధ్యలో ఆయన బూస్ట్ తాగొచ్చినట్లున్నారు. ఈసారి చాలా బలంగా లాగడం, నేను రష్యన్ భాషలో "చచ్చానోవ్... చంపేస్త్రానోవ్" లాంటి తిట్లు తిట్టడంతో "ఆపరేషన్ జ్ఞాన నిర్మూలన్" విజయవంతం అయింది.

ఆయన కాటన్ పెట్టడానికి దగ్గరకి వస్తుంటే నెప్పితో మాట రాక వేలు చూపించా. అసలు అరుంధతిలా కత్తి ఎత్తి పట్టుకుందామనుకున్నా కానీ కుదరలేదు.

"మీరు చాలా కో ఆపరేట్ చేసారు మేడం. అసలు మీలో ఇంత సహనం ఉందనీ, ఇలా కో ఆపరేట్ చేస్తారనీ అనుకోలేదు" అన్నాడు బొప్పి తడుముకుంటూ డాక్టర్.

మొత్తం జ్ఞానాన్ని ఆయన ఆస్పత్రికి డొనేట్ చేసి, నేను సిద్ధార్థుడు బుద్ధుడైనట్లు బయటకి నడిచాను.

డ్రైవర్ కారెక్కగనే "పొల్యూషన్ చెక్ చేయించాలి కారుకి" అని ఏదో అనబోయాడు. మాట్లాడలేదు. చెయ్యి ఎత్తాను. గబుక్కున చెంప పట్టుకున్నాడు. నేనేం అత్తారింటికి దారేదిలో పవన్ కళ్యాణ్‌లా పనోళ్ళని కొట్టను. కానీ ఆ బాధలో.. డ్రైవర్ కారు స్టార్ట్ చేసి "మా ఆవిడకి కూడా ఇట్లాగే పీకారు మేడం. అప్పుడది బయటకొచ్చి హోటల్ కెళ్దామా? అంటే నన్ను రెండు పీకింది. అందుకే జాగ్రత్తపడ్డా!" అన్నాడు.

సర్జరీ అయి ఇంటికొచ్చేసరికి, మా ఆయన నాకు రెస్ట్‌గా ఉంటుందనీ, తనకి సౌకర్యంగా ఉంటుందనీ అత్తగార్ని వెంట పెట్టుకొచ్చారు.

మా అబ్బాయి ముందు రాత్రి పార్టీకెళ్ళి లేట్‌గా వస్తే, బాల్కనీలో నిలబడే ఉన్నాను. తెల్లారి లేచి తిడ్తానని ఎదురు చూస్తుంటే, పన్ను పీకించుకొచ్చాను. దాంతో వాడు డేమ్ హేపీ. "అమ్మయ్యా ఇంకో నాలుగురోజులు మాట్లాడలేదు అమ్మ" అనుకున్నాడు.

మా అమ్మ మాత్రం నా బాధ చూసి కన్నీళ్ళు పెట్టుకుంది. ఆ మత్తులో ఉండగానే రాగిజావ తాగించింది.

అక్కడనుండీ నాకు టార్చర్ ప్రారంభం అయింది. క్రింద జా.. పైన స్కల్‌కి కనెక్షన్ కాబట్టి ఆ నెప్పి సరే. అది ఫిజికల్ దానికి పెయిన్ కిల్లర్స్ ఉన్నాయి. కానీ మనసు పడే బాధకి ఎవరూ పెయిన్ కిల్లర్స్ కనిపెట్టలేదే?

మా ఆయనా, మా అబ్బాయి నాకు ఒంట్లో బాలేదని బాస్‌లకి చెప్పి లీవ్ పెట్టేసారు.

నేను కళ్ళు మూసుకుని పడుకుందామంటే నిద్రపట్టదే. వంటింట్లోనుండి అమ్మ చేతి వంట ఘుమఘుమలు.

ఆవపెట్టిన అరటికాయకూర, గుత్తివంకాయకూర, దప్పళం, కొత్తమాగాయ తిరగమోత, పెసరట్లు. అల్లుడికోసం, మనవడి కోసం ఆవిడ వంటింట్లో శ్రమ పడ్తుంటే, సాయంత్రం నన్ను చూడటానికొచ్చిన నా స్నేహితురాళ్ళకోసం మా ఆయన తెచ్చే మిరపకాయ బజ్జీలు.

"ఏ.ఎస్.రావు నగర్‌లో లోపల నిమ్మరసం ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా చేస్తాడండి తినండి" అని ఆయన చెప్తుంటే అప్పటికి ఆరురోజులుగా పాలు, పళ్ళరసం, రాగి జావ మీద ఉండి నోరు చచ్చిపోయిన నాకు ఎలా ఉంటుందో మీరే చెప్పండి?

అంతేకాదు ఈయనకి అత్తగారి మీద కూడా ప్రేమ కారిపోయి "బందరు నుండి తెప్పించాను బెల్లం పూతరేకులు తినండి" అని పెడ్తాడు.

అల్లుడికోసం అమ్మ ఏమో వంకాయ బజ్జీ, దోసకాయ పచ్చడి, మామిడికాయ పప్పులోకి మజ్జిగ మిరపకాయలూ, గుమ్మడి వడియాలూ, కొత్త ఆవకాయా! ఇప్పుడు తిని 'సాయంత్రానికి ఏం చేసుకుందాం?' అని కబుర్లు. ఇవన్నీ నేను గోడవైపు తిరిగి పడుకుని సహిస్తూ వచ్చాను.

డాక్టర్ ఆర్.టి.ఎస్ నాయక్ అని అపోలోలో న్యూరోసర్జన్, నా ఫ్రెండ్, ఫోన్ చేసి "ఎలా ఉంది?" అని అడిగారు.

"డాక్టర్.. డెంటల్ సర్జరీవల్ల ఇదివరకు ఎవరైనా చచ్చిపోవడం విన్నారా?" అడిగాను.

ఠక్కున చెప్పారు "లేకేం.. బోలెడుమంది డాక్టర్లు పోయారు" అని.

ఆ తర్వాత నాకు డెంటల్ సర్జరీ చేసిన డాక్టర్ని తలచుకుని జాలి పడ్డారు.

మా డాక్టర్ మోహన వంశీతో "వంశీ ఇంకా ఏమైనా పెయిన్ కిల్లర్‌లు చెప్పవా?" అంటే ఫోన్లో, "ఏం తింటున్నానో తెలుసా! నువ్వుల ఉండలు, పల్లీ పట్టి. కటకట చప్పుడు వినిపిస్తోందా?" అని తింటూ, తనవంతు ఏడిపించాడు.

ఫేస్‌బుక్‌లో నా కష్టాలు పంచుకుంటే "అసలు మీకు జ్ఞానం పెరిగి ఇలా దంతంగా వచ్చి ఇన్ని బాధలు పడ్తూ రాయలేకపోవడానికీ, రాస్తే ఆ సినిమాలు థియేటర్లు దొరక్కపోవడానికీ ఇండస్ట్రీలో 'ఆ నలుగురే' కారణం" అని మా సాయి రాజేష్ (హృదయ కాలేయం డైరెక్టర్) సెటైర్లు.

ఇదే ఛాన్సు. నేను తిరిగి మాట్లాడలేనని నా ఎదురుగా కూర్చుని మా సినిమాలనీ, సినిమా వాళ్ళనీ విమర్శించే మా ఆయనా, నేను లిక్విడ్ డైట్ మీద ఉన్నానంటే జానీవాకర్ పంపిస్తా అన్న ఇంకో డైరెక్టర్ మిత్రుడూ... ఇలా అంతా ఏడిపించేస్తున్నారనుకోండీ.

"శనివారం నాడు ఆపరేషన్లు తెమలవు.. లాగుతాయి.. ఒక్కమాట పెద్దవాళ్ళని అడగొద్దూ?" అనే మా ఫ్రెండ్స్. నన్ను బాగా ఊరిస్తున్న కొత్తావకాయా, టీ.వీలో అస్తమానం 'ఖానాఖజానా' కుకింగ్ ఛానెల్స్‌లో, వంటలు చేసే మాస్టర్ షెఫ్స్!

ఎఫ్.బిలో రకరకాల చిరుతిళ్ళు పెట్టి, ఆ పప్పు చెక్కలు నాకు అంకితమిస్తూ కవిత్వం రాసిన కావలైట్(కావలి వాసి) బెహరాగారు.. కబుర్లతో కమ్మగా నవ్వించే బలభద్రపాత్రుని రమణీజీ.. మీకే ఈ కవిత (పప్పు చెక్కలు కూడా) అంకితం అంటూ..

"లోకములెన్నున్నగాని..భువియే గొప్ప
సమస్త జ్ఞానంలొసగు ఇచ్చోటనె..
విద్యలెన్నున్నగాని.. అక్షరమైనదొక్కటే గొప్ప..

సమస్త జ్ఞానమొసంగు విద్యనదియే

కళలెన్నున్నగాని.. మాటలాడుటయే గొప్ప

ఇహలోకమున జ్ఞానమునకు కొలబద్దదియే

కథలెన్నున్న గాని కబుర్ల కాలమే గొప్ప

గడప దాటకుండనె.. విషయ జ్ఞానము నిచ్చునదియే

నోటియందెన్నున్నగాని.. అది వచ్చుటయే గొప్ప

దంతముల యునికి జ్ఞానమునందెచ్చున దొక్కటియె

ముక్తాయింపు..

చెప్పులోన రాయి.. చెవిలోన జోరీగ

మీడియాలో తెలుగు ... పంటికైన సర్జరీ!

ఇంతింత కాదయా.. ఆ బాధ వర్ణింప రాదయా"

...ఖళ్....ఖళ్.. అంకితం(అని గుమ్మడిగారి స్టైల్లో) ఇచ్చిన బెహరాగారికి ధన్యవాదాలు.

బెహరాగారిని చూసి వెంకట్ టేకుమళ్ళగారు ఇన్‌స్పైర్ అయి

నవ్వు పంటలు పండించు నారిమణిర

కబురులెన్నియొ కలగల్పు కాంతమణిర!

రమణీ బలభద్రపాత్రుని రచనలన్ని

తెలుగు ప్రజలకు పాయస తీపి రుచిర"

అని రాసిన ఆయనకీ ధన్యవాదాలు.

చిన్నప్పుడు దంతధావనం అనే మాటరాక దంతావధానం అనేదాన్ని. అదే ఇప్పుడు చేస్తున్నా.. ఇంకా రసం మీదే నీరసంగా!

**ఇట్లు**

**మీ బలభద్రపాత్రుని రమణి.**

Post your comments




